# ఒక తుఫాన్ ఆగింది

ఆ రోజు ఆఫీసులో జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చింది ఆశాలత.

సాయంత్రం ఆఫీసు పని అయిపోయాక ఫైళ్ళు కట్టేసి బయటికి నడుస్తూంటే చీఫ్ అకౌంటెంట్ మాధవరావు వచ్చి కలిశాడు, ఆమెతో.

"మీకిక్కడ ఎవరైనా బంధువులున్నారా? ఎక్కడ దిగారు?" అనడిగాడు.

"ఆఁ చాలా దూరపు బంధువులు! ఇక్కడెవరూ నాకు తెలియకపోవడంవల్ల వాళ్ళింట్లో దిగాల్సివచ్చింది." కాస్సేపయ్యాక తిరిగి అంది ఆశా, "ఇక్కడ ఇళ్ళు దొరకడం చాలా కష్టం ఉన్నట్టుంది! మొన్నటినుండి ఇళ్ళవేట సాగిస్తున్నాను! కాస్త బాత్‌రూం, లావెట్రీ లాంటి వసతులతో చిన్న సింగిల్ గది దొరికినా తీసుకొందామని! ఎంత తిరిగినా లాభం లేకపోయింది. మీ ఎరికలోఏవైనా ఇళ్ళుంటే చెబుతారా?"

"మొన్నే మా ఫ్రెండు ఒకతడు ట్రాన్స్‌ఫరై ఇల్లు ఖాళీచేసి వెళ్ళాడు! ఆ ఇల్లు ఖాళీ ఉందో లేదో తెలుసుకొని చెబుతాను".

"అద్దె ఎంతుంటుంది సుమారుగా?"

"నాలుగు గదుల ఇల్లు. అయిదు వందలపైనే ఉంటుంది!"

"అంత పెద్ద ఇల్లు నాకక్కరలేదులెండి! నేనూ మా అమ్మగారు మాత్రం ఉంటాం! రెండు గదుల ఇల్లయితే చాలండీ! అంత పెద్ద ఇల్లు తీసుకొని జీతంలో సగం ఇంటి అద్దెకింద ఇచ్చి ఇంకేం తింటాం చెప్పండి?"

ఎదురుగా మీదికి వచ్చేస్తున్న లారీ నుండి తప్పించుకొనే ప్రయత్నంలో సడెన్‌గా ఇటు తిరిగింది ఆటో ఒకటి.

మాధవ్ తను చురుగ్గా తప్పుకొంటూ మెరుపులా ఆశా రెక్కపట్టి లాగేశాడు ఇవతలికి. అతడు లాగకపోతే ఆటో కింద ఉండేది ఆశాశరీరం రక్తపు మడుగులో విలవిల్లాడుతూ!

ఏం జరిగిందో తెలియడానికి నిమిషం పట్టింది ఆశాకు.

"బాబోయ్! ఎంత ప్రమాదం తప్పింది!" భయంగా గుండెలమీద చెయ్యుంచుకొంది.

లారీ డ్రైవరూ, ఆటోడ్రైవరూ తమ తమ వాహనాలు దిగి, యుద్ధరంగంలో అడుగుపెడుతున్న యోధుల్లా ఒకర్నొకరు దూకుడుగా సమీపించారు. మాటల బాణాలు సరిపోక చేతులు చేతులు కలుపుకొనే స్థితికి వచ్చేసరికి బస్సు వెళ్ళిపోతుందన్న తొందరలో స్టాప్ కేసి తిరిగి నడక సాగించారు మాధవ్ ఆశా.

మాధవ్ తన రెక్కపట్టి బలంగా లాగడం, ఏం జరిగిందో తెలియని అయోమయంలో కొద్దిసేపు అతడి వక్షాన్ని అనుకొని నిలబడడం గుర్తువచ్చి ఆశా మనసు జల్లుమన్నట్టుగా అయింది!

బలిష్ఠంగా, తెల్లగా ఉన్న అతడి చేతుల వంకా, విశాలంగా ఉన్న అతడి వక్షం వంకా చూస్తూన్న ఆశా మనసులో ఆరాధనాబీజాలు పడ్డాయి!

ఈ రోజు ఆఫీసులో కూడా పని అర్థమయ్యేటట్టుగా చెబుతూ అతడు చాలా సహాయపడ్డాడు తన పనిలో! మంచి హెల్పింగ్ నేచర్ అనుకొంది మనసులో.

మరుసటిరోజు ఆశా ఆఫీసుకు రాగానే "మా ఇంటికి దగ్గరలోనే ఇల్లొకటి ఖాళీగా ఉంది. వచ్చి చూస్తారా సాయంత్రం?" అనడిగాడు మాధవ్.

"సారీ మీకు అనవసరంగా శ్రమ కలిగించాను. చిన్న ఇల్లు దొరికింది! అడ్వాన్స్ ఇచ్చేశాను కూడా. రేపు సెలవు పెట్టి వెళ్ళి అమ్మనీ సామానునీ తీసుకువస్తాను" అంది ఆశా.

రెండు రోజుల సెలవుపెట్టి వెళ్ళి, తల్లినీ, సామానునీ తీసుకు వచ్చేసింది ఆశా.

నెల రోజులు గడిచాయి.

ఆఫీసులో ఇంకా చాలామంది స్టాఫ్ ఉన్నా ఆశా మాధవ్ దగ్గరే సాన్నిహిత్యం పెంచుకొంది. అతడి అందచందాలకంటే కష్టపడి పనిచేసే అతడి తత్వం ఎంతో నచ్చింది ఆశాకి. దానికితోడు చక్కటి సాహిత్యాభిరుచి ఉంది అతడికి. ఏ కాస్త తీరిక

చిక్కినా పుస్తక పఠనంలో ఉపయోగిస్తాడు ఆ సమయాన్ని. ఒక సినిమా చూసినా, ఒక నవల చదివినా చక్కటి విమర్శ చేయగలడు!

సీరియల్స్ తెగ చదివే అలవాటున్న ఆశాకి ఇది మరీ నచ్చుతుంది. ఏదైనా సీరియల్ మీద, సినిమా మీద అతడితో డిస్కస్ చేయాలంటే మరీ మరీ ఇష్టం ఆశాకి.

ఇద్దరి ప్రవర్తనా స్నేహపరిధిని దాటకపోయినా అప్పుడప్పుడూ ఇద్దరి కళ్ళలో ప్రణయభావం తళుక్కుమనక పోలేదు. ఆ క్షణంలో ఇద్దరి హృదయాలూ శ్రుతిచేసిన వీణలవుతాయి.

నిశ్శబ్దంగా రెండు కళ్ళు మాట్లాడుకొన్నా పసికట్టేవాళ్ళు లేకపోలేదు ఆఫీసులో. ముందుగా కనిపెట్టింది ఆశాకి పక్క సీటులో ఉండే సునంద.

"ఆఫీసులో ఇంతమంది ఉన్నా నీకు మేటర్ అర్థంకాకపోతే చెప్పడానికి ఒక్క మాధవే ఉన్నట్టు ఆయన బల్ల దగ్గరికే వెళ్ళతావేమిటి మాటి మాటికీ?" అనడిగింది ఓ రోజు.

"విసుక్కోకుండా ఏదడిగినా, ఎన్నిసార్లడిగినా చెబుతాడాయన."

"కొంతమంది చాలా సహృదయంగా కనిపిస్తారు. సమయం వస్తేగాని వాళ్ళ బండారం బయటపడదు!"

"ఇప్పుడు ఎవరి గురించి ఈ ఎత్తిపొడుపు?" ఆశా కనుబొమలు ముడిచి చిరాకుగా అడిగింది.

"పెళ్ళయిన మగవాళ్ళు ప్రణయంలో పడితే వాళ్ళ కొంపేమీ మునగదు కాని, పెళ్ళయిన మగవాళ్ళతో ప్రేమలోపడిన ఆడపిల్ల కొంపమాత్రం మునుగుతుంది తెలుసా?"

"మాధవ్‌కు పెళ్ళయిందా?" అప్పటికే కళావిహీనమైంది ఆశా ముఖం.

"చాలా అందగత్తె ఆయన భార్య. పండంటి ఇద్దరు బిడ్డలు. ఒక బాబు, ఒక పాప!"

"నిజమా?"

"అడిగి చూడు! అబద్ధమని చెబుతాడేమో!"

ఆశా మనస్సంతా పాడైపోయింది.

నెల రోజులకిందట ఈ మాధవ్ ఒకడున్నాడని తెలియదు. ప్రేమసరాగాలు ఆడకపోయినా, ప్రణయవిహారాలు సలపకపోయినా రెండు మనసులు గాఢంగా అల్లుకొన్న అనుభూతి హృదయంలో.

రోజూ మాదిరిగానే ఆ రోజు ఆఫీసుపని అయిపోగానే ఇద్దరూ ఒకేసారి బయటికి నడిచారు.

"మనం ఈ రోజు ఒక అరగంట సేపు ఎక్కడైనా గడుపుదాం!" అంది ఆశా.

సినిమాలకి, హోటళ్ళకి, పార్క్‌లకి వెళ్ళి ఏకాంతాన్ని కల్పించుకునే అవకాశం కోసం ఇంతవరకు ఆశాగాని, అతడుగానీ ప్రయత్నించలేదు.

మొదట ఆశానే చొరవ తీసుకోవడం చూసి మాధవ్ ముఖంలో ఉత్సాహం తళుక్కుమంది. "ఎక్కడైనా అంటే?"

"పార్క్‌కిగాని, హోటల్‌కి గాని వెడదాం."

"సరే!" అన్నాడు మాధవ్.

పావుగంట తరువాత ఒక పార్కులో కూర్చున్నారిద్దరూ.

అతడితో కల్పించుకొన్న మొదటి ఏకాంతమిది!

తన మనసులో రేగుతున్న అగ్ని జ్వాలల్ని ఎలా బయటపెట్టాలో తెలియడం లేదు ఆశాకి. గడ్డిపరకల్ని తుంచుతూ తుంచుతూ చివరికి గొంతు పెగల్చుకొని అంది ఆశ "మీరు వివాహితులని ఈ రోజే తెలిసింది నాకు!" బరువుగా అన్న ఆ ఒక్క మాటతో తన మనసులోని ఘర్షణనంతనీ వ్యక్తం చేయగలిగాననుకొంది ఆశా.

మాధవ్ ముఖంలో ఉత్సాహం ఊదేసినట్టుగా అయింది. "ముందుగానే తెలిస్తే?" నవ్వలేక నవ్వుతూ అడిగాడు.

"మీతో ఇంత దూరం వచ్చేదాన్ని గాదు!"

"ఎంత దూరం వచ్చాననుకొంటున్నావు?"

"వెనక్కి వెళ్ళలేనంత దూరం వచ్చాననుకొంటున్నాను."

"నేరం నాది కాదు కదా?"

"మాధవ్‌గారూ! అబద్ధం ఆడకండి! మగవాడి ననిపించుకోకండి! మన మధ్య నిజంగా ఏం లేదంటారా? మీరు ప్రేమించానని పెదవులతో చెప్పకపోవచ్చు! కాని, మీ చూపులు నే నంటే ఇష్టాన్ని వ్యక్తం చేయలేదా? ఆరాధనని వర్షించలేదా?" కొంచెం ఉద్వేగస్వరంతో అడిగింది ఆశా.

"ఈ విషయంలో అబద్ధం ఆడలేను! నీ నమ్మకాన్ని కాదనలేను!"

"మరి! ఇది నేరం కాదా? మీకు భార్యాబిడ్డలున్నారని తెలియక నేను ఆకర్షణలో పడితేపడొచ్చు! కాని మీరెలా మర్చిపోయారు భార్యాబిడ్డలున్న వాడినని?"

"మర్చిపోలేదు! నా భార్య అంటే ప్రేమా, గౌరవం కూడా! కాని నా మనసు ఎందుకు చెదిరిందో నాకే తెలియకుండా ఉంది! ఈ ఘర్షణ ఇవాళే నీలో ఏర్పడినా, నిన్ను చూసిన క్షణంనుండి ఈ ఘర్షణ నాలో సాగుతూనే ఉంది! ఆత్మవిమర్శ నన్ను నలిబిలి చేస్తూనే ఉంది. ఇంటి దగ్గర ఎన్నెన్నో నిర్ణయాలు చేసుకోవడం, నీ సమక్షంలోకి రాగానే ఆ నిర్ణయాలన్నీ గాలికి కొట్టుకుపోవడం జరుగుతూంది" హృదయానికున్న అడ్డు తొలగించి అక్కడ పోగుపడిన వేదన నంతటినీ ఆశా ముందు గుమ్మరిస్తున్నట్టుగా అన్నాడు.

"దీనికి పరిష్కారం ఏమిటంటారు?"

"దీనికి ప్రేమనీ, ఆరాధన అనీ పేరు పెట్టొద్దు ఆశా, మనం స్నేహితులంగా ఉందాం? మలినం లేని స్నేహంవల్ల ఎవరి జీవితాలకి ఏ ఆపదా రాదుగా?"

"స్త్రీ పురుషుల మధ్య ఏర్పడే స్నేహానికీ, ప్రేమకూ మధ్య చాలా సన్నని గీత ఉంటుంది, మాధవ్‌గారూ!"

"ఎంత సన్ననిగీతైనా సరే! నేను జాగ్రత్తగా కాపాడుతానని నీకు మాటిస్తున్నాను! ఇహ నీ సంగతి నువ్వు చూచుకో!"

"నే నా గీతను కాపాడలేకపోతే?"

"నీ కంటికి కనిపించనంత దూరం పారిపోతాను సరా!"

"మీరు పారిపోయినా మీవెంట మీ భార్యాబిడ్డలుంటారు! కాని, నేను? ఆ వెలితిని దేనితో పూడ్చుకోగలను?" అంటూంటే ఆశా గొంతు గాద్గదికమైంది. "మాధవ్‌గారూ! మనం ఇంతకంటే ముందుకు వెళ్ళొద్దు! సాధ్యమైతే వెనక్కి వెళ్ళే ప్రయత్నం చేద్దాం. అలా అయితే తప్ప మనం బతికిపోం!"

"నాకు నీ స్నేహం కావాలి ఆశా! అంతకుమించి నేనేమీ కోరను. నిన్ను కనీసం స్నేహితురాలిగానైనా నిలుపుకోకపోతే నే నుండలేను!"

"మన మధ్య ఉన్న ఆకర్షణకు ఎన్నాళ్ళని స్నేహమనే ముసుగు కప్పి ఉంచగలం?"

"ఎన్నాళ్ళయినా కప్పి ఉంచగలమన్న ధైర్యం నాకుంది!"

తనకు లేదని చెప్పడానికి సిగ్గుపడింది ఆశా. 'నా నుండి నువ్వు కోరుకొనేది ఇదేనా? తుచ్ఛమైన శరీర సౌఖ్యమా?' అని నవ్విపోగలదు.

తాము భార్యాభర్తలై దాంపత్య జీవితం గడిపే అవకాశం అసంభవం! అతడు భార్యాబిడ్డలున్నవాడు! పురుషుడు ఇద్దరు భార్యలను కలిగి ఉండడానికి చట్టం ఒప్పుకోదు.

'మేం పవిత్ర ప్రేమికులంగానే ఉంటాం! తుచ్ఛమైన కామంతో అది అపవిత్రం కాకుండా చూచుకొంటాం!' అని ఎవరికివాళ్ళు దృఢంగా నిశ్చయించుకొన్నారు.

✧ ✧ ✧

సినిమాలకీ, షికార్లకీ నిస్సంకోచంగా తిరగడం మొదలుపెట్టారు ఆశా, మాధవ్. సినిమాలమీద, నవలలమీద, రాజకీయాలమీద గంటలకి గంటలు వాదించుకొంటుంటారు. ఎవరిముందు దాపరికం, సంకోచం లేవు.

"మేం తప్పటడుగు వేయలేదు! స్నేహంగా ఉన్నాం తప్పా?' అన్న ధీమా వ్యక్తంచేస్తున్నారు.

ఒకరోజు సునంద పెట్టుకుంది ఆశాతో వాదం. "పెళ్ళయిన మగవాళ్ళతో ఈ స్నేహం ఏమిటి? చదువుకొన్నావు, మరీ ఇంత సంస్కారం లేకుండా ప్రవర్తిస్తున్నావెందుకు?"

"ఇప్పుడు సంస్కారం లేకుండా ఏం ప్రవర్తించాను?" ఆశా అడిగింది, దెబ్బ తిన్నట్టుగా.

"సాటి ఆడదాని సంసారం కూల్చడం సంస్కారమా చెప్పు?"

"మా మధ్య మీరనుకొనే అపవిత్ర సంబంధం ఏం లేదు. మేం స్నేహితులం అంతే! ఇంకేం లేదు!"

"నీకు స్నేహం చేయడానికి ఈ మగవాళ్ళే కావలసి వచ్చారా?"

"నువ్వూ చదువుకొన్నావు. మగవాళ్ళ మధ్య ఉద్యోగం చేస్తున్నావు. మగవాళ్ళతో స్నేహంచేస్తే తప్పంటావేమిటి? మగవాళ్ళతో మాట్లాడకుండా మడికట్టుకోవడం ఎలా కుదురుతుంది చెప్పు?"

"నేనూ మాట్లాడతాను! కాని, అది అవసరమైనంతమటుకే! మగవాళ్ళ మధ్య ఉద్యోగం చేసినంతమాత్రాన వాళ్ళని రాసుకుపూసుకు తిరగాల్సిన అవసరం లేదు. వాళ్ళతో స్నేహం చేయాల్సిన అవసరం అంతకంటే లేదు! ఇంకా మన ఆఫీసులో

నలుగురం ఆడవాళ్ళం ఉన్నాం వీళ్ళెవరూ నీకు పనికిరాకుండా మాధవే పనికి వచ్చాడా స్నేహానికి?"

"నలుగురు ఆడవాళ్ళుంటే నలుగురితో స్నేహం చేయం. మనకు ఏ ఒక్కరో నచ్చుతారు. మనకు దగ్గరగా ఒక్కరే వస్తారు. ఏ విషయమైనా చాటున అనుకోకుండా సూటిగా నాతోనే చర్చించే నువ్వు నాకు నచ్చావు! అలాగే మాధవ్ నాకు నచ్చాడు. ఏ విషయమైనా చక్కగా విశదపరిచే తీరు, మృదుగంభీరమైన సంభాషణ, అతడి భావాలు- అన్నీ నచ్చాయి! అందుకే మా మధ్య ఈ స్నేహం ఏర్పడింది. ఆ స్నేహానికి మీరు కుశ్చితపు మనస్తత్వంతో బురద రాస్తే నేనేం మాట్లాడనింక?"

కాని, తమ ప్రేమలో పవిత్రతను కాపాడుకోవడం దినదిన గండంగా తయారైంది ఆశాకు. ప్రేమ త్యాగం కంటే స్వార్థాన్నే బలంగా కోరుతుందన్న సత్యం అనుభవం కాసాగింది.

గంటలు గంటలు కబుర్లు చెప్పుకొన్నా తృప్తి కలగడంలేదు! ఇంకేదో కావాలనిపిస్తుంది! ఒకరిలో ఒకరు ఐక్యం కావాలనిపిస్తుంది.

అంతవరకు ఈ తహతహ, అశాంతి, ఆందోళన తొలగవనిపించింది ఆశాకు. ఒకరోజు ఖచ్చితంగా చెప్పేసింది. "మాధవ్! నీకు దూరంగా ఇక నేనుండలేను! మనం ఒకటికాకతప్పదు. ఈ మానసిక వ్యభిచారంకంటే అదే నయం!"

"వద్దు, ఆశా! నిగ్రహం కోల్పోవద్దు! నువ్వు సమస్యల్లో చిక్కుకోవడం నా కిష్టం లేదు!"

"నీకు నా మీద అంత ప్రేమే ఉంటే నాకు సమస్య లేకుండా చేయగలవు!"

"ఎలా?"

"నా మెడలో తాళికట్టు! నీ భార్య ననిపించుకో!"

"నా ఉద్యోగం ఉడిపోతుంది కదా!"

"ఎలాగైనా మీ ఆవిడని ఒప్పించు! ఆవిడ ఒప్పుకొంటే పేచీ ఉండదుగా! నువ్వు నన్ను పోషించక్కరలేదు. నా జీతం నాకుంటుంది! పిల్లలు పుట్టినా వాళ్ళ బాధ్యత నీమీద వేయను! వాళ్ళ తండ్రినని చెప్పుకోగలిగితే చాలు! తల్లీ తండ్రీ నేనై పెంచుకోగలను!"

"కాని, నా భార్యకు నేను ద్రోహం చేసినట్టు కాదా?"

"ఇంకో స్త్రీతో మనసు కలుపుకొని ద్రోహం చేయలేదా? నేనేం కోరుతున్నాను ఆమెను? పూర్తిగా మిమ్మల్ని నా కిచ్చేయమనడం లేదు. నాతోనే ఉండిపొమ్మనడం లేదు. మీ భార్యా పిల్లల తరువాతనే నా కింతచోటు పెట్టమని అడుగుతున్నాను యాచిస్తున్నాను."

ప్రస్తుతః సంస్కారపరుడు మాధవ్. ఆశాకి స్నేహితుడిగానే ఉన్నాడు. ప్రియుడు కాలేదంటే ఆ సంస్కారమే అతడిని కాపాడుతూంది.

ఆశాతో అనుబంధం తుంచనూలేడు శాశ్వతం చేసుకోనూ లేడు! ఆశాని భార్యగా స్వీకరించడమే జరిగితే తన భార్యాబిడ్డలు అన్యాయమైపోవడమే కాదు, ఆశాకి కూడా న్యాయం జరగదు.

"నా భార్యకు తెలియకుండా, ఆమె అనుమతి తీసుకోకుండా నేను నిన్ను భార్యగా స్వీకరించలేను, ఆశా! ఆమె ముందు నేను ఈ ప్రస్తావన తేలేను!"

"అయితే నేనే వచ్చి అడుగుతాను!"

"నువ్వా?" విస్మయంగా అన్నాడు.

"అవును! అవసరం నాది కదా?"

"ఏ భార్యా ఎంత సంస్కారవతి అయినా తన స్థానాన్ని మరో స్త్రీకి పంచడానికి ఒప్పుకోదు తెలుసా?" కొద్ది రోజుల క్రితం జరిగిన సంఘటన ఒకటి గుర్తుకు వచ్చింది మాధవ్‌కి.

✧ ✧ ✧

చాలా రోజుల క్రితమే ఆశా, మాధవ్ కలిసి తిరగడం గురించి వింది మాధవ్ భార్య జ్యోతి. 'ఏమిటిది?' అని భర్తను నిలదీసింది.

"ఆ అమ్మాయి సోషల్ టైప్ మగవాళ్ళతో ఫ్రీగా మాట్లాడుతుంది. ఫ్రీగా తిరుగుతుంది. నాతో ఇంకా కొంచెం చనువుతో ప్రవర్తిస్తుంది. అంతకు తప్ప ప్రపంచం ఊహించే చెడు ఏదీ మా మధ్య లేదు!" అని చెప్పాడు మాధవ్.

"మగవాళ్ళతో, అదీ పెళ్ళయిన మగవాళ్ళతో ఆ చనువేమిటో అడిగేస్తాను ఓ రోజు వెళ్ళి!" కోపంగా అంది జ్యోతి.

"అంతపని చేయకు! మాధవ్ భార్య ఎంత అన్‌కల్చర్డ్ అని అనుకోగలదు ఆ అమ్మాయి! 'మీరు చూస్తే ఇంత సంస్కారపరులూ! మీ భార్య ఏమిటి అంత మొరటు

మనిషి?' అని నా ముఖంలో నెత్తురుచుక్క లేకుండా చేయగలదు! ఇహ ఆ అమ్మాయి ముందే కాదు, ఎక్కడా తలెత్తుకోలేను!" అన్నాడు మాధవ్.

"భార్యా పిల్లలుండగా ఇంకో ఆడదానితో తిరగడం మహా గొప్ప సంస్కారమే లెండి! భార్యా బిడ్డలున్నవాడితో షికార్లకీ, సినిమాలకీ తిరగడం ఆవిడదీ గొప్ప సంస్కారమే! ఇద్దరూ వీర సంస్కారపరులు - ఇదేమిటని అడిగితే నేనో అడవి మనిషిని?" వెటకారం చేసింది జ్యోతి. "ఆ అమ్మాయి మీతో తిరిగినా, మీరు ఆ అమ్మాయితో తిరిగినా నాకు పెద్దగా పోయేదేమీ ఉండదు. మీ భార్యగా, మీ పిల్లల తల్లిగా నా స్థానం నా కుంటుంది. ఏదైనా జరిగితే నష్టపడేది ఆ అమ్మాయే. జీవితం సమస్యల మయం చేసుకొనేది ఆ అమ్మాయే! నేను వెళ్ళి అడగడమే జరిగితే ఆ సంగతే ఆమెకు స్పష్టం చేస్తాను."

"అబ్బా జ్యోతీ! మా మధ్య అలాంటిదేమీ లేదని చెబుతున్నాగా?" విసుగు వ్యక్తం చేశాడు మాధవ్.

✧ ✧ ✧

ఆ సంఘటన గుర్తుకురాగా, ఆశా నిర్ణయం వింటే జ్యోతి ఎంత మండిపడి, ఎంత అవమానిస్తుందో తలుచుకొని కలవరపడిపోయాడు మాధవ్.

ఆశాని ఇంటికి తీసికెళ్ళక తప్పలేదు మాధవ్‌కు ఒక రోజు!

మూసి ఉన్న తలుపు దగ్గర నిలబడి కాలింగ్ బెల్ నొక్కాడు మాధవ్.

జ్యోతి తలుపు తెరిచింది.

"ఈమె ఆశా. మా ఆఫీసులో ఎల్.డి.సి.గా పనిచేస్తూంది" పరిచయం చేశాడు మాధవ్.

జ్యోతి ముఖంలో చిరునవ్వు చెరిగిపోలేదు! కలవరపడిపోలేదు. "రండి! కూర్చోండి!" చాలా మర్యాదగా ఆహ్వానించి కూర్చోబెట్టింది.

ఆశాకే మనసు మనసులో లేదు, పట్టుబట్టి మాధవ్ వెంట వచ్చిందేగాని ఏం జరుగుతుందిప్పుడు! తన నోటి నుండి పెళ్ళిమాట వినగానే చీపురు పుచ్చుకొని తరిమేయదు కదా? ఇరుగు పొరుగు వినేలా గొడవచేసి అవమానించదు కదా?

ఆశా మనసు మరణదండన పడబోతున్న మనిషిలా ఉంది!

ఆశా పోరుపడలేక తీసుకువచ్చాడే గాని మాధవ్‌కీ మనసు కల్లోల సాగరంలా ఉంది! ఆశా మూర్ఖం కాకపోతే, జ్యోతి గొడవచేస్తే ఎలా?

అసలతడికి ఆశాను ఇంత దూరం తీసుకురావడం ఇష్టంలేదు. ఆశాని భార్యగా స్వీకరించడమే జరిగితే మూడు జీవితాలూ నరక ప్రాయమౌతాయనడంలో సందేహం లేదు! ఇద్దరి భార్యల మగడిగా ఎవరికీ న్యాయం చేయలేడు! ఎవరు మనసు కష్టపెట్టుకొన్నా తను భరించలేడు! ఆశాతో తన స్నేహం స్నేహంగానే మిగిలిపోవాలని అతడు కోరుకొంటున్నాడు.

ఆశాని భార్యకి పరిచయం చేయడంతో తన బాధ్యత తీరిపోయినట్టుగా అక్కడి నుండి జారుకొని బెడ్‌రూంలో పడుకొన్నాడు.

మ్యాగజైన్ ఒకటి ఆశాముందు పడేసి, “ఒక్క అయిదు నిమిషాల్లో వస్తాను? ఇది చూస్తుండండి!” అని లోపలికి వెళ్ళి అయిదు నిమిషాల్లో టీ కప్పుతో తిరిగి వచ్చింది జ్యోతి.

“ఇక చెప్పండి! ఏమిటి విశేషాలు?”

“మీరు నా గురించి, మాధవ్ గురించి వినే ఉంటారు!”

“ఆఁ విన్నాను!”

“విని ఏమనుకొన్నారు?”

“పెళ్ళయిన మగవాడితో ఈ ఆడపిల్లకు ఏం స్నేహం అనుకొన్నాను; ఎంత బుద్ధిలేదా అనుకొన్నాను!”

“జ్యోతిగారూ! నిజంగా నాకు బుద్ధి లేదు! లేకపోతే మాధవ్ మీద ఇంత అనురాగం ఎందుకు పెంచుకొంటాను!” ఆశా స్వరం దుఃఖంతో గాద్గదికం కాగా కళ్ళలో అశ్రువులు చోటుచేసుకొన్నాయి. “మాధవ్ జీవితం మీద నాకు అధికారం వద్దు! ఆ అధికారం మీదే! కాని, నాకింత చోటివ్వండి ఆయన జీవితంలో! ఆయన జీతంలో పైసా కూడా నా కోసం ఖర్చుపెట్టక్కరలేదు! ఉద్యోగస్థురాలిని! నా సంపాదన నాకుంటుంది. నాకు పిల్లలు పుట్టినా వాళ్ళ బరువు బాధ్యతలు నేనే చూచుకొంటాను! మాధవ్ భార్య ననిపించుకోవడం ఒక్కటే నాకు కావాలి! ఇంకేం వద్దు!”

ఆ కంఠంలోని ప్రాధేయతకు శిలలైనా కరిగిపోవలసిందే!

“ఆయన జీవితంలో కొద్దిగా చోటు పెడితే చాలా? ఇంకేమీ అక్కరలేదా?” జ్యోతి చెదరని చిరునవ్వుతో అడిగింది.

“ఇంకేమీ అక్కరలేదండీ!”

"సరిగ్గా ఇలాంటి పరిస్థితే మా అమ్మకీ ఎదురైంది? అంటే మా నాన్నగారిని కూడా ఇలాగే ఓ లంపటం తగుల్కొంది! ఆమెను సరాసరి తీసుకువచ్చి ఇంట్లోనే పెట్టాడు మా నాన్న. మా అమ్మ ఏడవలేదు! గొడవ చేయలేదు. మహారాణిలా కాలుమీద కాలు వేసుకు కూర్చొనేది! కనీసం పిల్లల స్నానాలు, బట్టలు కూడా చూసేదికాదు! చక్కగా పత్రికలు, పుస్తకాలు చదువుతూ అమ్మలక్కలతో కబుర్లు చెబుతూ కూర్చొనేది! అంత చాకిరీ నాన్నకు ప్రియురాలిగా వచ్చిన పాపానికి ఆవిడే చేసేది! ఆవిడకు పిల్లలు పుడితే ప్రాబ్లంగా తయారవుతారని ఆవిడకి ట్యూబెక్టమీ చేయించారు నాన్న. అమ్మ ఏమో ఆరునెలల బాలింత, మూడు నెలల చూలింత అన్నట్టుగా పిల్లల్ని కంటుండేది! వంటపని, ఇంటిపని, బాలింతపని, పిల్లలపని... పాపం ఆవిడ ఎముకల పోగులా తయారైంది. పనిచెయ్యకపోతే అమ్మ వెళ్ళగొట్టేస్తుందేమోనని ఆవిడ భయం! ఏదైనా గొడవ జరిగితే నాన్న వదిలేస్తారేమోనని భయం!...ఆవిడ గురించి ఎవరైనా జాలిపడుతూ మాట్లాడితే, 'భార్యాపిల్లలున్నవాడిని తగుల్కోవడానికి దానికి బుద్ధి ఉండొద్దా? సాటి ఆడదాని కాపురంలో నిప్పులు పోద్దామని వచ్చిందా? దాని పాపానికి ఈ ప్రాయశ్చిత్తం అనుభవించవద్దా? దాని వేలితోనే దాని కళ్ళు పొడుస్తాను!' అని కసిగా నవ్వేది అమ్మ!"

"నేను ఉద్యోగస్తురాలిని, మాధవ్ నన్ను పోషించే పరిస్థితి ఎదురైనప్పుడు కదా నాకీ సోద్యం చెప్పాల్సింది!" అభిమానంగా అంది ఆశా.

"అయితే రెండో కథ చెప్పనా? నా స్నేహితురాలు ఒకామె శారద అని ఒకాయనకి మూడో భార్యగా వెళ్ళింది! తను నీలాగే ఉద్యోగస్తురాలు! ఏదో గుళ్ళో ఒకరిద్దరు స్నేహితుల సమక్షంలో పూలదండలు మార్చుకొని భార్యాభర్తలనిపించుకొని కాపురం పెట్టారు! అతడి ఇద్దరు భార్యలూ అదే ఊళ్ళో! వాళ్ళు అట్టే చదువుకొన్నవాళ్ళు కాదు! పెద్దామెకు పిల్లలు కాలేదని రెండో ఆమెను చేసుకొన్నాడు. రెండో ఆమెను చేసుకొన్నాక మొదటామెకి పుట్టారు పిల్లలు.

ఈమెకీ పుట్టారు! ఇక శారద – ఇద్దరికీ ఉద్యోగరీత్యా రాత్రి డ్యూటీలు పడేవి! పెళ్ళికాలేదు పాతికేళ్ళు వస్తున్నా! కోరికల గుర్రాలకు కళ్ళెం తగిలించడం కష్టమై పోతున్న వయసు. అతడు ఇద్దరు భార్యల మగడైనా చాలా యాక్టివ్‌గా, ఆకర్షణీయంగా ఉండేవాడు. పెళ్ళికి ముందే ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడింది. అతడికి మూడో భార్యగా వెళ్ళటమా అన్న ప్రశ్నేలేకుండా అతడిని పెళ్ళిచేసుకోవాల్సి వచ్చింది శారదకు.

"కొత్త మోజులో స్వర్గం అంచులదాకా తీసికెళ్ళాడు ఆమెను. మోజు తీరాక ఆమె తిప్పలుకి ఆమెను విడిచిపెట్టటం మొదలుపెట్టాడు. ఫస్ట్ వచ్చేసరికి ఆ అవసరం

ఈ అవసరం అని డబ్బు పట్టుకెళ్ళటానికి మాత్రం వచ్చేవాడు. పెళ్ళికాకముందు చేయించుకొన్న నగా, నట్రా, కూడబెట్టుకొన్న బాంక్ బాలెన్స్ అంతా ఖాళీ. అదీ, దానికి పుట్టిన పిల్ల, ఆ ఉద్యోగం మిగిలాయి! భార్యాభర్తలంటే శరీరాల వేడి తీర్చుకోవడమే ప్రధానం కాదు. ఒకరి కష్టం సుఖం ఒకరు పంచుకొనేట్టుగా ఉండాలి. దాని జీతం తప్ప కష్టంసుఖం పంచుకోని మగడు, తనకి సుస్తీచేసినా, పిల్లకి సుస్తీచేసినా పక్కన అనునయంగా తట్టే చెయ్యుండేది కాదు! ఎన్నో రాత్రులు వొంటరిగా గడిచిపోయేవి. దుఃఖంతో, దిగులుతో దానికి క్రమంగా పిచ్చెక్కిపోయింది. ఒకరోజు పిల్లను చంపేసి, తను చచ్చిపోయింది.

"చెప్పు! నువ్వు అలాంటి చావు కోరుకుంటున్నావా? నువ్వు చేసుకొంటానన్నా నాకు భయంలేదు. నా స్థానం ఎలా నిలబెట్టుకోవాలో నాకు తెలుసు! నేను కురూపిని కాదు, చదువులేనిదాన్ని తెలివిలేనిదాన్ని కాదు! ఆయన్ని ఎలా ఆకట్టుకోవాలో నాకు తెలుసు! ఆయన్ని నా కొంగున కట్టేసుకొన్నానంటే నువ్వా శారదలా చచ్చిపోవలసిందే కదా?"

"వద్దండీ! ఇంకేం చెప్పకండి! నేను శారదలా కుక్కచావు చావలేను!" భయకంపిత స్వరంతో అంది ఆశా.

"నీకు అందముంది! చదువుంది! అంతకుమించి ఉద్యోగము ఉంది! చక్కగా నీకు సరిపోయిన జోడీని చేసుకోక ఈ ఎంగిలి విస్తరికి ఎందుకు కక్కుర్తి పడతావు! ఈ పెళ్ళి జరిగితే, ఆయన ఇద్దరు భార్యల ముద్దులమగడిగా జల్సాగా ఉంటారు! ఆయన భార్యగా నేనూ బాగానే ఉంటాను. మధ్యలో అపమార్గాన వచ్చినదానివి... నువ్వే నాశనమైపోతావు! సాటి ఆడదానిగా నీ జీవితం నాశనం కాకూడదనే నేను ఈ సలహా ఇస్తున్నాను! ఇకపై నీ ఇష్టం!"

ఆశా కళ్ళు రెండూ వరదొచ్చిన గోదావరిలా ఉన్నాయి. "నా కళ్ళు తెరిపించారు జ్యోతిగారూ! సవతిగా రాబోతున్నదాన్ననీ ఈర్ష్యలేకుండా నన్ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఎంత గొప్ప మనసు మీది. మీలాంటి వివేకవతి, అందగత్తె అయిన భార్య ఉండగా మాధవ్ ఎవరివాడూ కాలేడు! అతను పూర్తిగా మీకే ఉంటాడు! నేనికవస్తాను. మీకిక నేను కనిపించను. మాధవ్‌కి కూడా చాలా దూరంగా వెళ్ళిపోతాను! సెలవు!" చేతులు జోడించి అశ్రురుద్ధ స్వరంతో సెలవు తీసుకొంది.

ఒక తుఫాన్ ఆగిపోయింది.

*యువ మాసపత్రిక, ఏప్రిల్ 1987*

◆